# బోణీ ఎవరిదో?

**నేడు భారత్, ఇంగ్లండ్ తొలి టీ20 • రాత్రి 7 నుంచి స్పోర్ట్స్-18లో**



కోల్‌కతా: పొట్టి పోరుకు వేళయైంది. ప్రపంచంలో రెండు అత్యుత్తమ జట్లు భారత్, ఇంగ్లండ్ మధ్య టీ20 సమరానికి బుధవారం తెరలేవనుంది. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చేదు అనుభవాలను మరిపించేందుకు టీమ్‌ఇండియాకు ఈ సిరీస్ దోహదం చేయనుంది. దీనికి తోడు ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు కూర్పుపై ఒక అంచనాకు వచ్చేందుకు ఇరు జట్లకు ఇది ఉపయోగపడనుంది. బలబలాల పరంగా సమవుజ్జీలుగా కనిపిస్తున్న ఐదు మ్యాచ్‌ల టీ20 పోరులో బోణీ ఎవరిదన్నది ఆసక్తికరంగా మారింది. చారిత్ర ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగే మ్యాచ్‌లో గెలువడం ద్వారా సిరీస్‌లో ముందంజ వేయాలని రెండు జట్లు పట్టుదలతో ఉన్నాయి. సొంతగడ్డపై సత్తాచాటేందుకు ఓవైపు కుర్రాళ్లతో కళకళలాడుతున్న టీమ్‌ఇండియా కనిపిస్తుంటే..మరోవైపు ఇంగ్లండ్ దుర్భేద్యమైన బ్యాటింగ్ బలగంతో సై అంటున్నది. ఈ నేపథ్యంలో బ్యాటింగ్‌కు స్వర్గధామమైన ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల వరద ఖాయం అనిపిస్తున్నది. ఇదిలా ఉంటే గాయం నుంచి తేరుకున్న సీనియర్ పేసర్ షమీపై అందరి కండ్లు ఉన్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి ముందు షమీ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు ఈ సిరీస్ మంచి అవకాశం కానుంది. సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా తుది జట్టులో ఇద్దరు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లు ఉండే అవకాశముంది. ఆల్‌రౌండర్ల కోటాలో సుందర్, నితీశ్ ఇద్దరిలో ఒకరికి చోటు దక్కనుంది. మ్యాచ్‌కు ముందే ఇప్పటికి ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించగా, యువ బ్యాటర్ జాకబ్ బెతెల్ విధ్వంసం కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మంధాన @ 2

దుబాయ్: భారత స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన నంబర్‌వన్ ర్యాంక్‌కు మరింత చేరువైంది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా సూపర్‌ఫామ్ కొనసాగిస్తున్న మంధాన తాజా ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు దూసుకొచ్చింది. ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఓ సెంచరీ సహా అర్ధసెంచరీతో రాణించిన మంధాన 738 పాయింట్లతో ఒక ర్యాంక్ మెరుగుపర్చుకుని టాప్-10లో కొనసాగుతున్న ఏకైక భారత బ్యాటర్‌గా నిలిచింది. దక్షిణాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ (773) అగ్రస్థానంలో ఉంది. తొలి సెంచరీతో ఆకట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 17వ ర్యాంక్‌కు చేరుకోగా, హర్మన్‌ప్రీత్‌కౌర్ 15లో ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ 680 పాయింట్లతో ఒక ర్యాంక్ ఎగబాకి నాలుగులో నిలిచింది. సోఫీ ఎకల్‌స్టోన్ (770) టాప్‌లో ఉంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తిశర్మ (344) ఆరో ర్యాంక్‌లో ఉంది.

## చికితకు చేయూత

**'అక్షర' నుంచి 10లక్షల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్, ఆసియాకప్ టోర్నీలకు ఎంపికైన రాష్ట్ర యువ ఆర్చర్ చికితారావుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు చేయూత అందించారు. మంగళవారం హైదరాబాద్‌లో జగన్‌ను చికిత మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న చికిత సరైన ప్రోత్సాహం లేదని తెలుసుకున్న జగన్..చికితకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. అక్షర విద్యాసంస్థల నుంచి ఈ యువ ఆర్చర్‌కు 10లక్షల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలి విడతగా రూ.50 వేల చెక్ అందించగా, వచ్చే ఫిబ్రవరి నుంచి శిక్షణ కోసం ప్రతి నెల 15వేల ఉపకారవేతనం ఐదేళ్ల పాటు అందిస్తామని జగన్ స్పష్టం చేశారు.





## క్రికెట్‌లో కొత్త శకం

**ఐవోసీ చీఫ్ బాచ్‌తో జైషా భేటీ**

లాసానే: క్రికెట్‌లో కొత్త శకానికి నాంది పడిందని ఐసీసీ చైర్మన్ జై షా పేర్కొన్నాడు. దాదాపు 128 ఏండ్ల తర్వాత తొలిసారి ఒలింపిక్స్(లాస్‌ఏంజిల్స్ 2028)లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) చీఫ్ థామస్ బాచ్‌తో జైషా ప్రత్యేకంగా భేటీ అయ్యాడు. ఈనెల 30న లాసానేలో జరిగే కీలకమైన ఐవోసీ సెషన్‌కు ముందు పలు కీలక అంశాలపై వీరి మధ్య చర్చ జరిగిందని ఐసీసీ పేర్కొంది.

## మా జెర్సీలపై మీ దేశం పేరొద్దు!

**చాంపియన్స్‌ట్రోఫీలో మరోవివాదం**

లాహోర్: మరికొద్దిరోజుల్లో పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరగాల్సి ఉన్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో మరో వివాదం నెలకొంది. భారత జట్టు ధరించే జెర్సీలపై ఆతిథ్య దేశం పాకిస్థాన్ లోగో ఉండటాన్ని బీసీసీఐ నిరాకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఐసీసీ టోర్నీలలో భాగంగా ఆతిథ్య దేశపు పేరు, లోగోను జెర్సీపై ముద్రించడం ఆనవాయితీగా వస్తోందని.. కానీ బీసీసీఐ మాత్రం అందుకు అంగీకరించడం లేదని పీసీబీ ఆరోపిస్తోంది.

## భారత షట్లర్ల శుభారంభం



జకర్తా: ఇండోనేషియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ జోడీ 21-16, 21-15తో చెన్ జి రే- లిన్ యు చె (చైనా)ను చిత్తు చేసింది. ప్రపంచ 19వ ర్యాంకు తనీషా జంట 21-6, 21-14తో ఒర్నిక-సుకిత (థాయ్‌లాండ్)పై అలవోక విజయం సాధించింది.



వైష్ణవి (4-1-5-5)

# వైష్ణవి 5/5

**హ్యాట్రిక్‌తో అదరగొట్టిన బౌలర్**

**మలేషియాపై భారత్ రికార్డు విజయం**

కౌలాలంపూర్: ఐసీసీ అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో భారత అమ్మాయిలు వరుస విజయాలతో దుమ్మురేపుతున్నారు. మలేషియాతో మంగళవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. ఆతిథ్య జట్టును 31 పరుగులకే ఆలౌట్ చేసిన టీమ్‌ఇండియా.. లక్ష్యాన్ని 2.5 ఓవర్లలోనే ఛేదించింది. గత మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 47 పరుగులకే పరిమితం చేసిన భారత బౌలర్లు.. మలేషియా బ్యాటర్లకు ఆ మాత్రం అవకాశం కూడా ఇవ్వలేదు. యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ (5/5) ఐదు వికెట్లతో చెలరేగింది. అందులో హ్యాట్రిక్ కూడా ఉండటం విశేషం. రెండో ఎడిషన్‌గా జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ తరఫున ఇదే తొలి హ్యాట్రిక్. అయూషి శుక్లా (3/8) ఆ జట్టును కట్టడిచేసింది. మలేషియా బ్యాటర్లలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయకపోగా నలుగురు డకౌట్ అయ్యారు. ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చిన 11 పరుగులే ఆ జట్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఛేదనలో తెలంగాణకు చెందిన గొంగడి త్రిష (12 బంతుల్లో 27 నాటౌట్, 5 ఫోర్లు) దూకుడుగా ఆడటంతో వికెట్ నష్టపోకుండానే భారత్ మ్యాచ్‌లో జయభేరి మోగించింది. వైష్ణవికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. తాజా విజయంతో గ్రూప్-ఏలో భారత్ 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. లంకకూ 4 పాయింట్లే ఉన్నా నెట్‌రన్ రేట్ విషయంలో భారత్ మెరుగ్గా నిలిచింది. లీగ్ దశలో భారత్.. గురువారం శ్రీలంకతో ఆఖరి మ్యాచ్ ఆడనుంది.

# సాహో జొకో

**హోరాహోరీ పోరులో అల్కరాజ్‌పై అద్భుత విజయం • ఆస్ట్రేలియా ఓపెన్ సెమీస్‌కు అర్హత • పోరాడిన ఓడిన స్పెయిన్ కుర్రాడు**

**వయసు, గాయం, పటిష్ఠ ప్రత్యర్థి.. కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న నొవాక్ జొకోవిచ్‌ను ఇవేమీ ఆపలేకపోయాయి. అచ్చొచ్చిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో తనకు ఎదురేలేదంటూ ఈ సెర్బియా దిగ్గజం మరోసారి రుజువు చేశాడు. గత రెండు వింబుల్డన్ ఫైనల్స్‌లో తనను ఓడించి.. ఇటీవల కాలంలో తనకు కొరకరాని కొయ్యగా మారిన కార్లోస్ అల్కరాజ్‌తో హోరాహోరిగా జరిగిన ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్స్ పోరులో జొకో అనుభవం ముందు స్పెయిన్ కుర్రాడు తలవంచక తప్పలేదు. నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో అనుభవజ్ఞుడైన జొకోదే పైచేయి అయ్యింది. సెట్ సెట్‌కు తన ఆటతీరుకు మరింత మెరుగులు అద్దిన జొకో..ఓవరాల్‌గా గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 50వ సారి సెమీస్‌కు చేరాడు.**



మెల్‌బోర్న్: టెన్నిస్ ఓపెన్ ఎరాలో మునుపెవరికీ సాధ్యం కాని విధంగా 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న నొవాక్ జొకోవిచ్.. ఆ దిశగా కీలక ముందడుగు వేశాడు. తనకు అచ్చొచ్చిన ఆస్ట్రేలియా ఓపెన్‌లో జొకో అనుభవం ముందు యువ సంచలన కార్లోస్ అల్కరాజ్ తలవంచాడు. మెల్‌బోర్న్‌లోని రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో సీడ్ జొకో 4-6, 6-4, 6-3, 6-4తో అల్కరాజ్‌ను ఓడించి ఈ టోర్నీలో రికార్డు స్థాయిలో 12వ సారి సెమీఫైనల్స్‌కు చేరాడు. ఆద్యంతం హోరాహోరీగా మూడున్నర గంటల పాటు సాగిన మ్యాచ్‌లో విజయం కోసం కోర్టులో ఇరువురూ కొదమసింహాల్లా పోరాడారు. భారీ ర్యాలీలు, బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో అలరించిన ఇద్దరూ.. ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌కు ముందే అభిమానులకు ఫైనల్ మజాను అందించారు.

**తొలి సెట్ ఓడినా..**

మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన అల్కరాజ్ తొలి సెట్‌ను గెలుచుకుని పైచేయి సాధించాడు. అదే సమయంలో జొకో ఎడమ కాలికి గాయం కావడంతో అతడు వైద్య సాయం తీసుకుని తిరిగొచ్చాక మొదలైంది అసలు ఆట. రెండో సెట్ ఆరంభం నుంచే తనలోని అసలైన ఆటగాడిని బయటకు తీసిన జొకో.. మ్యాచ్‌పై పట్టు బిగించాక ఇక వెనక్కి తగ్గలేదు. రెండో సెట్‌లో 3-0తో ఆధిక్యంలో ఉండగా అల్కరాజ్ కూడా వరుసగా పాయింట్లు సాధించి స్కోరును సమం చేశాడు. కానీ జొకో మాత్రం వరుసగా రెండు గేమ్‌లు గెలిచి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అల్కరాజ్ పుంజుకునేందుకు ప్రయత్నించినా ఆ అవకాశమివ్వలేదు. మ్యాచ్ మొత్తమ్మీద జొకో 5 ఏస్‌లు సంధిస్తే..అల్కరాజ్ 10 కొట్టాడు. 13 బ్రేక్ పాయింట్లకు జొకో ఆరింటిని కాపాడుకుంటే..అల్కరాజ్ 11లో నాలుగుకే పరిమితమయ్యాడు. జొకో 3సార్లు డబుల్ ఫాల్ట్స్ చేయగా, స్పెయిన్ స్టార్ ఐదు సార్లు తప్పిదానికి పాల్పడ్డాడు. ఈ ఇద్దరి పోరును చూసేందుకు వచ్చిన అభిమానులతో స్టేడియం మొత్తం కిక్కిరిసిపోయింది. జొకోకు ఇది 50వ గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ కాగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో 99వ విజయం. సెమీస్‌లో అతడు జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో క్వార్టర్స్‌లో జ్వెరెవ్ 7-6(7/1), 7-6 (7/0), 2-6, 6-1తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించి సెమీస్ చేరాడు.



**గాఫ్ ఔట్..**

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక.. హ్యాట్రిక్ టైటిల్ వేటలో మరో ముందడుగు వేసింది. క్వార్టర్స్‌లో సబలెంక 6-2, 2-6, 6-3తో పవ్లిచెంకొవాను ఓడించింది. గంటా 53 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో సబలెంక.. తొలి సెట్ గెలిచి రెండో సెట్ కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మక మూడో సెట్ నెగ్గి తన కెరీర్‌లో పదో గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరింది. మరో క్వార్టర్స్‌లో కోకో గాఫ్ (అమెరికా)కు 5-7, 4-6తో బడోస (స్పెయిన్) షాకిచ్చింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో బోపన్న-జెంగ్ (చైనా) జంట 6-2, 4-6, 9-11తో జాన్ పీర్స్-ఒలివియా గెడెక్కి (ఆస్ట్రేలియా) చేతిలో పోరాడి ఓడింది.

## 200 కోట్ల క్లబ్‌లో 'సంక్రాంతికి వస్తున్నాం'



వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో రికార్డు వసూళ్లతో సంచలనం సృష్టిస్తున్నది. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా వారం రోజుల్లోనే 203కోట్లకు పైగా కలెక్షన్స్‌ను సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలో కూడా రికార్డు స్థాయి వసూళ్లను రాబడుతున్నదని, అక్కడ ఇప్పటివరకు 2.3 మిలియన్ డాలర్లకుపైగా వసూలు చేసిందని మేకర్స్ తెలిపారు. వీటితో పాటు వెంకటేష్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రంగా 'సంక్రాంతికి వస్తున్నాం' నిలవడం విశేషం. మరోవారం పాటు పెద్ద చిత్రాల రిలీజ్‌లు లేకపోవడంతో 'సంక్రాంతికి వస్తున్నాం'కలెక్షన్స్ మరింతగా పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## చిలుకూరు బాలాజీ సేవలో ప్రియాంకచోప్రా

బాలీవుడ్ అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా మంగళవారం ప్రఖ్యాత చిలుకూరు బాలాజీ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది ప్రియాంక చోప్రా. 'బాలాజీ ఆశీస్సులతో జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. దేవుడి దయతో మనందరం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లాలని కోరుకుంటున్నా' అని ప్రియాంక చోప్రా తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇదిలా వుండగా మహేష్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కనున్న పాన్ వరల్డ్ అడ్వెంచరస్ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటించనుందని, అందుకే ఆమె హైదరాబాద్‌కు విచ్చేసిందని వార్తలొస్తున్నాయి.

## కనిపెడితే పదివేలు



'ఈ సినిమాలో నాది లాయర్ పాత్ర. అందుకే అందరం లాయర్ గెటప్‌లో వచ్చాం. సినిమాలో నా పేరు సిద్ధార్థ నీలకంఠ. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అండ్ క్రిమినల్ లాయర్‌ని. అసలు నేను క్రిమినల్ లాయర్‌నా? లేక క్రిమినలా? ఒక నేరంతో లాయర్‌కు ఏమైనా సంబంధం ఉందా? అనే ఆసక్తికరమైన అంశాలతో థ్రిల్‌ని పంచుతుంది' అన్నారు సాయిరామ్ శంకర్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకుడు. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సాయిరామ్‌శంకర్ మాట్లాడుతూ..ఈ సినిమాకు 'పట్టుకుంటే పదివేలు' పేరుతో ఓ కాంటెస్ట్ పెడుతున్నామని, ఇంటర్వెల్ లోపు విలన్ ఎవరో కనిపెడితే థియేటర్లోనే పదివేలు అందిస్తామని, యాభై కేంద్రాల్లో ఈ కాంటెస్ట్ నిర్వహించబోతున్నామని తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిదని, సాయిరామ్‌శంకర్ చాలా కొత్తగా కనిపిస్తాడని దర్శకుడు పేర్కొన్నారు. కథాపరంగా, సాంకేతికంగా ఈ సినిమా గొప్పగా ఉంటుందని నిర్మాత గార్లపాటి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. శృతి సోధి, అశిమ నర్వాల్, సముద్రఖని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాహుల్‌రాజ్, నిర్మాతలు: వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేష్, కథ, మాటలు, దర్శకత్వం: వినోద్ కుమార్ విజయన్.

## హైలెస్సో హైలెస్సా




నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బన్నీ వాసు నిర్మాత. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది. శ్రీకాకుళం జిల్లాలోని ఓ మత్స్యకారుల గ్రామంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా, ఈ నెల 23న ప్రేమ గీతం 'హైలెస్సో హైలెస్సా' విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం పాట తాలూకు పోస్టర్‌ను విడుదల చేశారు. సాగరతీరంలో నాయిక సాయిపల్లవి నృత్యం చేస్తుండగా, నాగచైతన్య చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరాల్ని అందించిన ఈ పాట హృద్యమైన ప్రేమగీతంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: గీతా ఆర్ట్స్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

## ఇచ్చుకుందాం బేబీ..



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో 'ఇచ్చుకుందాం బేబీ..' అంటూ సాగే రెండో గీతాన్ని ఈ నెల 23న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ సంగీతంలో రొమాంటిక్ గీతంగా ఆకట్టుకుంటుందని, నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ బ్యూటీపార్లర్ నడిపించే మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభించిందని, రొమాన్స్, యాక్షన్, కామెడీ అంశాలతో ఈ సినిమా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, రచన: వాసుదేవ మూర్తి, దర్శకత్వం: రామ్ నారాయణ్.

## నేటి యుగంలో త్రిబాణధారి

సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, ఉదయభాను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్‌శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వానర సెల్యూలాయిడ్ పతాకంపై విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఏకకాలంలో మూడు బాణాలు సంధించడంలో నేర్పరి అయిన బార్బరికుడి స్ఫూర్తితో ఈ సినిమాకు త్రిబాణధారి అనే పేరు పెట్టామని, పౌరాణిక పాత్ర నేటి ప్రపంచంలోకి అడుగుపెడితే ఎలా ఉంటుందనే ఫాంటసీ ఎలిమెంట్‌తో ఈ సినిమాను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నామని, త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేష్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బ్యాండ్, సమర్పణ: మారుతి టీమ్ ప్రొడక్ట్, రచన-దర్శకత్వం: మోహన్ శ్రీవత్స.



## జూన్ నుంచి 'కల్కి-2' షురూ



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ నిర్మించిన 'కల్కి 2898' చిత్రం గత ఏడాది జూన్‌లో విడుదలై రికార్డు స్థాయి వసూళ్లతో చరిత్ర సృష్టించింది. భారతీయ పురాణేతిహాసాల స్ఫూర్తితో సోషియో ఫాంటసీ కథాంశంతో దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సినిమాకు దేశవ్యాప్తంగా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఇదిలావుండగా ఈ సినిమాకు సీక్వెల్‌ను తెరకెక్కించబోతున్న విషయం తెలిసిందే. తొలిభాగం షూటింగ్ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన కొన్ని ఎపిసోడ్స్‌ను కూడా చిత్రీకరించారు. రెండో భాగం తాలూకు 25శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాత అశ్వనీదత్ గతంలో వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం జూన్ నుంచి 'కల్కి-2' షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారని తెలిసింది. ఇందులో ప్రభాస్‌తో పాటు కీలక తారాగణం పాల్గొనగా ముఖ్య సన్నివేశాలను తెరకెక్కిస్తారని చెబుతున్నారు. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ తాజా చిత్రం 'ది రాజా సాబ్' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించబోతున్న 'స్పిరిట్' ఏప్రిల్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.



## వీర వనిత యేసుబాయి

'పుష్ప' సిరీస్ చిత్రాలతో ఉత్తరాది ప్రేక్షకుల్లో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది రష్మిక మందన్న. ఆమె నటించిన తాజా హిందీ చిత్రం 'ఛావా' ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. మరాఠీ చారిత్రక యోధుడు ఛత్రపతి శంభాజీ వీరోచిత పోరాటగాథను ఆవిష్కరిస్తూ పీరియాడిక్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ నటించగా, ఆయన భార్య మహారాణి యేసుబాయి పాత్రలో రష్మిక మందన్న కనిపించనుంది. మంగళవారం రష్మిక మందన్న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో సంప్రదాయ మరాఠీ వస్త్రధారణలో బంగారు ఆభరణాలు ధరించి రాజసం ఉట్టిపడుతూ కనిపిస్తున్నది రష్మిక. 'గొప్ప రాజులందరీ విజయాల వెనక శక్తివంతులైన మహారాణుల పాత్ర ఉంటుంది. మహారాణి యేసుబాయి...ది ప్రైడ్ ఆఫ్ స్వరాజ్య' అంటూ ఈ స్టిల్‌కు క్యాప్షన్‌ను జత చేశారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందించారు. రష్మిక మందన్న ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో ఆరు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.